

అర్జీలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

కడప : ప్రతి సోమవారం 'స్పందన' కార్యక్రమంతో పాటు మండల స్థాయిలో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జెసి జి.గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సిపిఒ వెంకట రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వీరన్న, జిల్లా వ్యవసాయ అధికారి జెడి నాగేశ్వరరావు, డిఆర్‌డిఎ పిడి ఆనంద్ నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కడప ప్రగతిపై అంతులేని నిర్లక్ష్యం

పదేళ్లుగా 'ఉక్కు' ఆశలు హుళక్కి!

ప్రాజెక్టు పనుల్లో పురోగతి ప్రశ్నార్థకం

హార్టీ హబ్ హామీ బుట్టదాఖలు

నాడు టిడిపి.. నేడు వైసిపి దొంగాట

జిల్లాకు చేరుకోనున్న సిపిఎం ప్రజా రక్షణభేరి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప సమగ్రాభివృద్ధిపై అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలో ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు. జిల్లా కరువుకు కేరాఫ్ అడ్రెస్‌గా మారింది. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పనుల్లోనూ ఎటు వంటి పురోగతి కనిపించడం లేదు. 2017లో వరదల్లో గల్లంతైన ఎల్‌ఎస్‌పి గేట్ల సాక్షిగా మిగిలిన 12 ప్రాజెక్టు పనుల్లో ఆశించిన పురోగతి కనిపించలేదు. మహానగరాలకే పరిమితమైన ఆర్కిటెక్చర్ యూనివర్శిటీని కడప గడపలో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ కాగితాలకే పరిమితమైంది. టిడిపి ప్రభుత్వం జిల్లాను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తామన్న వాగ్దానం నీటి మూటను తలపిస్తోంది. ప్రతిపక్ష నేత హోదాలో జగన్ మూడున్నరేళ్లలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అందని ద్రాక్ష పుల్లన సామెత చందంగా మారింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎండగట్టేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 30న కర్నూలు జిల్లాలో మొదలుపెట్టిన ప్రజా రక్షణభేరి యాత్ర మంగళవారం సాయంత్రానికి మైదుకూరుకు చేరుకోనుంది. అనంతరం బద్వేల్ మీదుగా కడప, ఎర్రగుంట్ల ప్రాంతాల మీదుగా బస్సుయాత్ర సాగనుంది.

సాగునీటి ప్రాజెక్టుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలోని గండికోట, సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు ఎప్పటికీ సాగులోకి వస్తుందో తెలియడం లేదు. ప్రభుత్వం ప్రాజెక్టు పనుల పూర్తికి నిధుల కేటాయింపులు చేయకపోవడంతో మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కి చందంగా మారింది. రూ.212 కోట్లతో కూడిన సర్వరాయసాగర్ ప్రాజెక్టు రివిట్‌మెంట్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. జిఎన్‌ఎస్ఎస్ ప్యాకేజీ-1, 2 పనులు చేసిన అవెక్సా కంపెనీకి రూ.150 కోట్ల బిల్లులు చెల్లింపులు చేయకపోవడంతో సర్వరాయసాగర్ రివిట్‌మెంట్ పనులు అడుగు ముందుకు పడడం లేదని సమాచారం. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్, ఎగువసగిలేరు, దిగువ సగిలేరు ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందించలేని పరిస్థితి నెలకొంది. తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలోని బ్రహ్మంసాగర్ లీకేజీ వ్యవహారం కొలిక్కి రావడం లేదు. ఫలితంగా 17 టిఎంసిలను పూర్తిస్థాయిలో నిల్వ చేయ లేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా 1.78 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. పొరుగునున్న ప్రకాశం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. ఫలితంగా పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల్లోని ఐదు వేల ఎకరాల ఆయకట్టు సాగు కొలిక్కి రావడం లేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి జగన్ 25 శాతంలోపు పనులు చేసిన సాగునీటి ప్రాజెక్టుల టెండర్లు, గాలేరు-నగరి ప్రాజెక్టులో అంతర్భాగమైన మూడవది మినహా మిగిలిన ఆరు ప్యాకేజీలను రద్దు చేసింది.



ఈ ఏడాది ఫిబ్రవరి 14న జమ్మలమడుగు మండలంలోని సున్నపురాళ్లపల్లె వద్ద ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన చేస్తున్న సిఎం జగన్

కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే రాష్ట్ర విభజన హక్కు పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. కేంద్రంలోని బిజెపి సర్కారు ఉద్దేశ పూర్వకంగా పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న హామీని తొక్కి పెట్టింది. 2017లో ప్రతి పక్ష నేత హోదాలో చేపట్టిన పాద యాత్రలో మూడున్నరేళ్లలో పరిశ్రమను ఏర్పాటు చేస్తా మని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఇచ్చిన హామీలు నీరో డుతున్నాయి. కేంద్రలోని బిజెపి సర్కారు వెనుకబడిన ప్రాం తాలకు నిధులు కేటాయించాలనే నిబంధనల్ని తుంగలో తొక్కింది.

రూ.376 కోట్లతో కూడిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్ కేర్, సైక్రియాటిక్ ఆస్పత్రుల భవన నిర్మాణాలు పూర్తి చేయడం, ఏర్పాటు చేస్తామని హామీ ఊరట కలిగించడం మినహా ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. మైదుకూరు నియోజకవర్గంలో అరుదైన పంటగా గుర్తింపు పొందిన కెపి ఉల్లి, పసుపు సాగు ప్రశ్నార్థకంగా మారింది. కెపిఉల్లి ఉత్పత్తుల నిల్వకు కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం మద్దతు ధర కల్పనపై నిర్లక్ష్యం మేటలు మేసింది. బద్వేల్‌కు సోమశిల రిజర్వాయర్ నుంచి తాగునీటి లిఫ్ట్ ఇరిగేషన్ ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు.

నేడు మైదుకూరు, బద్వేల్, కడపలో బహిరంగ సభలు

సిపిఎం నేతలు ఎం.ఎ.గపూర్, ప్రభాకర్‌రెడ్డి రాక

ప్రజా రక్షణభేరి పేరిట సిపిఎం ఆధ్వర్యంలో తలపెట్టిన బస్సు యాత్ర మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి మైదుకూరు పట్టణానికి చేరుకుంటుంది. అక్కడి నుంచి బద్వేల్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి మధ్యాహ్నం కడపలో తలపెట్టిన బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకోనుంది. జిల్లాలోని మైదుకూరు, బద్వేల్, కడప పట్టణాల్లో నిర్వహించనున్న బహిరంగ సభలకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గపూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య, ఉమామహేశ్వరరావు హాజరుకానున్నారు. మధ్యాహ్నానంతరం యర్రగుంట్ల మీదుగా అనంతపురం జిల్లాలో అడుగుపెట్టనుంది.

కరువు నివారణ చర్యలు శూన్యం

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

వైసిపి ప్రభుత్వానికి రాజకీయ ఎజెండా తప్ప ప్రజల అజెండా లేదని, 65 శాతం ఉన్న అన్నదాతల కన్నీటి ధారలు తెలియాలంటే ప్రజాప్రతినిధులు పల్లెబాట పట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరువు నివారణ చర్యలు చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. చినుకులు లేక కర్షకుల బతుకులు చిధ్రమయ్యాయని తెలిపారు. పచ్చని పంటలకు నీటి తడులు అందక మాడిపోతున్నాయని, అన్నదాత దుర్భర పరిస్థితుల్లో అండగా నిలవాల్సిన సర్కారు భరోసా పట్టించుకోక రైతుల బాధలు అరణ్య రోదనగా మారాయి అన్నారు. కష్టాల కౌగిట్లో రైతులు పుట్టెడు దుఃఖంలో అన్నదాతల ఆర్తనాదాలు కన్నీటి ధారలు ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. కడప జిల్లాలో 17 ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణంలో సగం కూడా ఈ ఏడాది సాగు చేయలేదని, చేసిన సాగు కూడా తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోయిందన్నారు. కరెంటు కోత భూగర్భ జలాల కొరత పశుగ్రాసం కొరత ఉపాధి హామీ పథకం నిర్లక్ష్యం చేయటంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. కడప జిల్లాలోని 36 మండలాలలో 17 మండలాలు తీవ్రమైన కరువును ఎదుర్కొంటున్నాయని వారు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని అన్నారు. కరువు అంచనా పంటలను నష్టపరిహార అంచనా వేరేది వేసే ప్రభుత్వ అధికారులకు ఎన్నికల పనులు ఆరు నెలల ముందే అప్పగించడం ద్వారా కరువు అంచనా వేలేకున్నారన్నారు. అన్నదాత కన్నీటి ధారలు తెలియాలంటే ప్రజాప్రతినిధులు పల్లెబాట పట్టాలన్నారు. 119 ఏళ్ల నాటి కరువు కడప జిల్లాలో నేడు తాండవిస్తోందని కానీ కరువు నివారణ చర్యలు రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. వైఎస్ఆర్ జలకలకు నిధులు నిలిపివేయడంతో వేయాల్సిన బోర్లు వేయకుండా కాంట్రాక్టర్లు జారుకుంటున్నారన్నారు. ఖరీఫ్‌లో సన్న కారు చిన్న కారు కవులు రైతులు నష్టపోయిన పంటలకు పూర్తి నష్టపరిహారం ప్రభుత్వమే చెల్లించాలని రవి పంటకు ఆర్థిక సహకారం బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందించాలని, రైతాంగ బ్యాంకు రుణాలు రీ షెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. తుంగభద్రా నది పరివాహక సాగు రైతుల కరువును, ప్రకృతి వైపరీత్యాన్ని అంచనా కట్టిన కర్ణాటక ప్రభుత్వం 2023, సెప్టెంబర్ లోనే కేంద్ర కరువు బృందాన్ని పర్యటించాలని డిమాండ్ చేసిందని తెలిపారు. అదే పరివాహక ప్రాంతంలో ఉన్న రాయలసీమ, కడప జిల్లా లో కేంద్ర కరువు బృందం పర్యటించాలని నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఆరు నెలల కాలం తర్వాత ఉన్నా ఇప్పటినుండే వైసిపి ప్రభుత్వానికి ఎన్నికల పిచ్చి, జ్వరం పట్టుకునిందని పేర్కొన్నారు. రైతుల పాలిట అది శాపంగా మారిందని విమర్శించారు.

రైలు ప్రమాద మృతులకు డివైఎఫ్ఐ నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

విజయనగరం జిల్లాలో రైలు ప్రమాద ఘటన చాలా బాధాకరం అని మృతులకు డివైఎఫ్ఐ జిల్లా కమిటీగా నివాళులు అర్పిస్తున్నమని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక పులే సర్కిల్ లో డివైఎఫ్ఐ అధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం దేశంలో ఏదోఒక చోట రైలు ప్రమాదాలు సంఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న ఒడిస్సాలో భారీ రైలు ప్రమాద ఘటన మరువక ముందే మన రాష్ట్రంలో విజయనగరం జిల్లాలో రైలు ప్రమాద ఘటన జరగడం శోచనీయమని పేర్కొన్నారు. రెండు ప్రమాద ఘటనలలో సిగ్నలింగ్ వ్యవస్థ కారణంగానే అధికారులు చెబుతున్నారని తెలిపారు. మారుతున్న కాలంలో పెరుగుతున్న టెక్నాలజీ ద్వారా ఇంకా సిగ్నలింగ్ లోపం కారణంగా ప్రమాద ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరం అన్నారు. కేంద్రం ఇప్పటికైనా గుర్తించి రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు పని భారం తో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే రైల్వేలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి సరైన సదుపాయాలతో చికిత్స చేయాలని, మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డిఎం ఓబులేష్, నగర ఉపాధ్యక్షులు విజయ్, ఉదయ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలి

ప్రజాశక్తి - కడప

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 2 నుంచి గుంటూరులో నిర్వహించబోయే రాష్ట్ర మహిళ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మైకేల్ డేనియల్ ప్రదీప్ అన్నారు. సోమవారం సాయంత్రం కడప ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సుధీర్ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్స్ బాలికల జట్టు ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను రాష్ట్ర కార్యదర్శి మైఖేల్ డేనియల్ ప్రదీప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. జిల్లా స్థాయి ఎంపికల్లో మంచి ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మంచిగా రాణించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ పట్టుదలతో పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.థామస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు బి. డేనియల్, మైకల్, కోచ్ లు హరి, సునీల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ మహిళ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల పేర్లను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. సుధీర్ ప్రకటించారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో శ్రీదేవి (కెప్టెన్) వెన్నెల, సావిత్రి, సాహిఆన, రోహితారెడ్డి, అంజనా రెడ్డి, దుర్గ, మైథిలి, అశ్విని, శ్రీదేవి, చంద్ర వదన, షణ్ముగ, హేమ వందన, వర్షిత రెడ్డి, సాహిత్య, గీతాంజలి, రెడ్డమ్మ, నిహారిక, సిరి చందన ఉన్నారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో మైకేల్ డేనియల్ ప్రదీప్

పెండింగ్ పనులను పూర్తిచేయాలి : కలెక్టర్

కడప : జగనన్న కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో హౌసింగ్, జగనన్న ఆరోగ్య సురక్ష, జగనన్నకు చెబుదాం, వైద్యం, విద్య, ఎన్నికల నిర్వహణ సన్నద్ధత, నాడు-నేడు పనుల పురోగతిపె క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ళు పథకంలో భాగంగా జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను ఇప్పటికే మొదటి దశలో పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేశారన్నారు. అదే స్ఫూర్తితో మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తీ చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు సంబంధించి నివేదికలను సంపూర్తి చేయాలన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్, జగనన్న చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, వాహన మిత్ర, నేతన్న నేస్తం మొదలైన పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల అక్నాలెడ్జ్‌మెంట్ డేటాపై సమీక్షించారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో పోలింగ్ స్టేషన్ల వారిగా సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో జెసి జి. గణేష్ కుమార్, నగర కమీషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, డిపిఒ ప్రభాకర్ రెడ్డి, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు సిహెచ్‌ఒలు, ఎంఎస్‌ఒలు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల్లో టిడిపికి ఆదరణ

ప్రజాశక్తి - కడప అర్బన్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అమీర్‌బాబు

తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికీ ప్రజల గుండెల్లో ఉన్నారని ఆ పార్టీ కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వి. ఎస్. అమీర్ బాబు, సీనియర్ నాయకులు అలంకాన్ పల్లి లక్ష్మీరెడ్డి, యువ నాయకులు మన్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని 37వ డివిజన్ ఇన్‌ఛార్జి జకీర్ హుస్సేన్, డాక్టర్ అసోసియేషన్ కార్యదర్శి నసీవుద్దీన్ ఆధ్వర్యంలో చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టా రంటూ ప్రజలకు తెలుపుతూ ఇంటింటికి ప్రచారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్రానికి చేసిన మేలు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ఎన్నో కుటుంబాలకు బాసటగా నిలిచారని పేర్కొన్నారు. ఎటువంటి ఆధారం లేని కేసులో అరెస్టు చేసి 51 రోజులు గడుస్తున్న జగన్మోహన్ రెడ్డికి పైశాచిక ఆనందం ఇంకా తీరలేదన్నారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, కడుప నగరం ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది లింగాల శంకర్ రెడ్డి, ఆదిల్, మాజీ సర్పంచ్ వెంకటేష్, మైనార్టీ కార్యదర్శి నాసర్ అలీ, జయరాం రెడ్డి, ఓబుల్ రెడ్డి, పిచ్చయ్య, బాబా ఫక్రుద్దీన్, మామిళ్ళ శివ, చిప్పగిరి శీను, ఫజల్, సాదక్, వసీం, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి-కడప సిటీ

విద్యార్థులు క్రమశఇతోపాటు నైతిక విలువలు అలవరుచుకోవాలని జిల్లా విద్యాశాఖాధి రాఘవరెడ్డి, సర్వశిక్ష అభియాన్ జిల్లా అధికారి అంబవరం ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఫౌండేషన్ లిటరసీ, న్యూమారసిలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్లు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఆరు రోజులపాటు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల పిల్లలు తప్పకుండా చదవడం, రాయడం,, చతుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా చేయడం శిక్షణ కార్యక్రమం ఉద్దేశమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం జ్ఞానంతో పాటు లోకజ్ఞానం పెంపొందించే దిశగా విద్యాబోధన చేయాలన్నారు. నైతిక విలువలు పెంపొందించి నిజ జీవితంలో ఉన్నత స్థానాలు చేరుకుంటారన్నారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడూ శిక్షణను పొంది నాణ్యమైన విద్యాబోధనకు కృషి చేయాలని అన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి రాఘవ రెడ్డి మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు అందరూ కూడా చిన్నపిల్లలు కాబట్టి వారికి ఆట పాటలు, కృత్యాలు, కథల ద్వారా బోధన చేసినట్లయితే వాళ్ళు చక్కగా అవగాహన చేసుకుని నేర్చుకోవడానికి వీలవుతుందన్నారు. ఆరోగ్యంగా, మానసికంగా బాగా ఉన్నప్పుడు అభ్యసన స్థాయి బాగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అకాడమీక్ మానిట రింగ్ అధికారి ధనలక్ష్మి, రామాంజనేయ రెడ్డి, విజయలక్ష్మి, కీ రిసోర్స్ పర్సన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

సమాధులు తొలగించవద్దు

కడప అర్బన్ : నగరంలోని పేరు ప్రఖ్యాతలుగాంచిన యాకూబ్ సాహెబ్ ఖబరస్తాన్‌లో ఉన్న సమాధులను తొలగించవద్దని టిడిపి కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జ్ వి.ఎస్.అమీర్ బాబు, మసీదు కమిటీ మతపెద్దలు కోరారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ విజయరామరాజుకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ మరోమారు చర్చిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు నిసార్‌అహ్మద్, సెక్రెటరీ ఫారుక్, అడ్వేకెట్ అలీ ఖాన్, అక్రమ్, హమీద్ ముస్లిం సోదరులు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి పిటిడిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కె. కుమార్ ఎన్. రాజశేఖర్ కోరారు. సోమవారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వర పరిష్కారం చేయాలన్నారు.. చిన్న, చిన్న కారణాలతో సస్పెండ్ చేసిన, రిమూవ్ చేయబడిన ఉద్యోగులు అప్పీల్స్ లేక 15 నెలలుగా ఎదురుస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అప్పీల్‌పై ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, వెంటనే పరిష్కారానికి డిపిటిఒ లకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఓవర్ టైం పేరిట అదనపు పని గంటలు పని చేయించుకోంటూ ప్రతినెలా జీతంతో కలిపి ఇవ్వడం లేదని చెప్పారు. ప్రతినెలా జీతంలో చెల్లించే సదుపాయం కల్పించాలని కోరారు. పెండింగ్ ఉన్న డే/నైట్ షిఫ్ట్ అలవెన్సు బకాయిలు కూడా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సంస్థ అభివృద్ధికి కలిసి పని చేయాలనే ప్రాథమిక సూత్రం వదిలేశారని వారికి తగు సూచనలు ఇవ్వాలని తెలిపారు. సమస్యలను పరిష్కరించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కాశినాయన



బాల ఓబయ్య ఎం. రవీంద్రబాబు

ఎస్‌టియు మండల నూతన కమిటీని పోరు మామిళ్ల రీజియన్ భవనంలో సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎం. రవీంద్ర బాబు, ప్రధాన కార్యద ర్శిగా ఎం బాల ఓబయ్య, ఆర్థిక కార్యదర్శిగా టి. ప్రదీప్ ఎన్నుకు న్నారని శాఖ జిల్లా కౌన్సిలర్ యు.సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ ఎస్‌టియు అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తామని తెలిపారు.

క్రైస్తవుల కూటమిలో పేలుడు సిగ్గుచేటు

ప్రజాశక్తి - కడప అర్బన్

క్రైస్తవుల కూటమిలో పేలుడు సిగ్గు చేటని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. సోమవారం నగరంలో కొవ్వొత్తుల శాంతియుతంగా కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్ బాషా మాట్లాడుతూ క్రైస్తవుల పైన పేలుడు సిగ్గుచేటు అన్నారు. అమ్రా అంతర్జాతీయ సమావేశం కేంద్రంలో ప్రార్థనలు చేస్తున్న చోట పేలుళ్ల సంఘటనలో మహిళా మృతి చెందారని తెలిపారు. చాలామందికి 50 శాతం కంటే ఎక్కువ శరీరం కాలిపోయిందని తెలిపారు. ఇంటెలిజెన్స్ విభాగాలు ఏం పని చేస్తున్నాయని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి అలీ షేర పాల్గొన్నారు.

ఇసుక, మద్యం దోపిడీ తప్ప అభివృద్ధి శూన్యం

- మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో శాండ్ మైన్, వైన్ దోపిడీ తప్ప అభివృద్ధి లేదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. సోమవారం శ్రీనివాస రెసిడెన్సి లో ఉమ్మడి జిల్లా టిడిపి జనసేన కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాకు చెందిన జగన్ అనుచరులు దోచుకుంటున్నారని తెలిపారు. జగనన్న లేఅవుట్‌లలో అనేక అక్రమాలు జరిగాయని చెప్పారు. జనసేన, టిడిపి కలిపి పోరాటం చేస్తాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో జనసేన, టిడిపి మధ్య దూరం పెంచేందుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి గతంలో ఎందుకు ఒంటిరిగా పోటీ చేయలేదని ప్రశ్నించారు. చంద్రబాబు బయటికి వస్తే ఎదుర్కొనే దుమ్ము లేదని పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నేతృత్వంలో కలిసి ముందుకెళ్తామని చెప్పారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి నాయబ్ కమాల్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అక్రమాలు దౌర్జన్యాల పై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రికి రైతుల మీద ధ్యాస లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 30 లక్షల ఎకరాలకు సాగు నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖలో సంస్కరణల పేరుతో దోచుకుంటున్నారని వాపోయారు. ఆంధ్ర రాష్ట్రాన్ని కాపాడేందుకు జనసేన, టిడిపి పొత్తు పెట్టుకుందని తెలిపారు. సమావేశం టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, జనసేన కడప నియోజకవర్గ ఇన్చార్జి సుంకర శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ క్రైమ్ బారిన పడ్డ బాధితులు ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ అధికారులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆపస్' జిల్లా అధ్యక్షులుగా చెన్నయ్య

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా నూతన అధ్యక్షుడిగా శెట్టెం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా దేవిరెడ్డి కొండారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు జీ.వి. సత్యనారాయణ ప్రకటించారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా పి. బాలానాయుడు, కోశాధికారిగా సి.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులుగా పి. నారాయణ రెడ్డి, వై. సుధాకర్ రెడ్డి, పి నాగ మునీశ్వర్ రెడ్డి, కె.రామకృష్ణారెడ్డి, పి. శ్రీనివాసులు, బి.భాస్కర్ రెడ్డి, కె. నాగరాజు, ఎస్. నాగలక్ష్మి కార్యదర్శులుగా జి. రమణయ్య, ఏ. ప్రకాష్‌రెడ్డి, ఆర్. చంద్రమోహన్ కార్యవర్గ సభ్యులుగా జి. జనార్దన్, మీడియా ఇన్‌ఛార్జిగా పి.బాలకృష్ణుడు క్రీడా కన్వీనర్‌గా ఎన్. సతీష్, సాంస్కృతిక కన్వీనర్‌గా యు. రామచంద్ర, సేవా కన్వీ నర్‌గా సి. భోగీశ్వరయ్య, డివిజనల్ కార్యదర్శిగా కె. రామ మోహ న్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. అనంతరం నూతన కార్యవర్గంతో పరిశీలకులు ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆర్థిక స్వావలంబనకు మళ్లీ జగన్ సిఎం కావాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పేద, బడుగు బలహీనవర్గాల ఆర్థిక స్వావలంబనకు, ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎంపిపి శేఖర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం ఆయన స్థానిక రామేశ్వరం మోటేల వద్ద నున్న చౌడమ్మ ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమం నందవరం చౌడమ్మ ఆలయం వరకు కొన సాగుతుంది. పాదయాత్రను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, వైసిపి నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ 30ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నడిపించిన ఎమ్మెల్యే రాచమల్లు రానున్న ఎన్నికల్లో 35వేల మెజార్టీతో గెలుపొందాలన్నారు. పాదయాత్ర ప్రతి రోజూ 23 కిలోమీటర్ల మేర కొనసాగించనున్నారు. 100మందితో పాద యాత్ర కొనసాగింది గురువారం రాత్రికి నందవరం చేరుకుంటున్నారు. కార్య క్రమంలో ఎంపిపి సతీమణి సోములవారిపల్లి సర్పంచ్ ప్రశాంతి శేఖర్, బిసి నేత చల్లా రాజగోపాల్ యాదవ్, వైసిపి కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఇతర నాయకులు, కార్యకర్తలు, రాచమల్లు అభిమానులు పాల్గొన్నారు.



ఎంపిపిని అభినందిస్తున్న వైసిపి నాయకులు

టిటిడి కల్యాణ మండపాన్ని బాగు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక నారాపుర వెంకటేశ్వర దేవస్థానం వద్ద ఉన్న టిటిడి కల్యాణ మండపాన్ని అధికారులు బాగు చేసి అందుబాటులోకి తేవాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ కోరారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో సోమ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఈ కల్యాణమండపం కూడా ఎంతో వైభ వంగా వెలిగిందన్నారు. తక్కువ ఖర్చుతో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలను నిర్వహించుకునేవారని తెలిపారు. అయితే టిటిడి దేవస్థానం పరిధిలోకి వచ్చిన తర్వాత మండపాన్ని ఆ అధికారుల నిర్లక్ష్యానికి శిథిలావస్థకు చేరిందన్నారు. దీని పునరుద్ధరణకు ఆదాయం వస్తున్నా మరమ్మతులు చేయడం లేదన్నారు. ఆ డబ్బులు ఏమి అవుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఎక్కడికి వెళుతున్నాయని ప్రజలకు అనుమానాలు కూడా వస్తున్నాయన్నారు. సిపిఎం నాయకులు కొండయ్య, పల్లా లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శివనారాయణ

డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన ఉండాలి

చాపాడు : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ డిజిటల్ బ్యాంకింగ్ అంశంపై అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు కెజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి విజయ సూచించారు. సోమవారం కేకే మేళాలో భాగంగా విద్యార్థులకు రామ్ టు టీడ్ అంశంలో భాగంగా సచివాలయ మహిళా పోలీస్ సునంద ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలు అధికం అయ్యాయన్నారు. ఓటీపీలు, పిన్ కార్డ్ నెంబర్‌లను తెలుసుకొని బ్యాంక్ ఖాతాలోని నగదును అపహరిస్తున్నారని తెలిపారు. వీటిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అన్నీ కష్టాలే : భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : వైసిపి అధికారంలోకి వచ్చాక పేద, మధ్య తరగతి ప్రజలకు అన్నీ కష్టాలేనని టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని సాయిరాం థియేటర్ వెనుక వీధి, ఎంపీడీఓ ఆఫీస్ వీధి, కవల వీధుల్లో సోమవారం ఆయన బాబుతో నేను, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి తన కార్యకర్తలతో ఇంటింటికీ తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. ఆఫీస్ వీధిలోని మహిళలు పైపుల ద్వారా వచ్చే తాగునీరు కలుషితం అవుతుందని, తాము తరచూ రోగాల బారిన పడుతున్నామని చెప్పారు. సమస్య విన్న వెంటనే ఆ మహిళల సమక్షంలోనే డిఇకి ఫోన్ చేసి వివరణ అడగ్గా.. ఆయన సమస్యను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అక్కడున్న మహిళలు భూపేష్ రెడ్డి స్పందించిన తీరుకు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బాల పుల్లారెడ్డి, గట్టు పుల్లయ్య, జి.కె గైబు, మహేంద్ర, రామ్మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎంఎం బాషా, వెంకటరెడ్డి, హనుమంత్‌రెడ్డి, చిన్న పుల్లారెడ్డి, మునేష్, జగదీష్, గౌస్ పీర్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యం అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం

- అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ రవిబాబు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని ఎడిఎంహెచ్ఒ డాక్టర్ రవిబాబు తెలిపారు. మండల పరిధిలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సోములవారిపల్లె మూడవ సచివాలయంలోని పెన్నానగర్ ప్రజలకు ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద తహశీల్దార్ నజీర్ అహ్మద్ ఆధ్వర్యాన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రవిబాబు మాట్లాడారు. వైద్యులు హనీఫ్‌బాబా, శ్రీకాంత్, జరీనా, హుసేన్ బాషా, కంటి వైద్యులు తేజ రోగులను పరీక్షించారు. ఐసిడిఎస్ వారు పోషకవిలువలు గల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. మండల స్పెషల్ ఆఫీసర్ సురేష్‌రెడ్డి, కార్యదర్శి హరినాథ్, నజీర్ హుస్సేన్, నూర్ అహ్మద్, వీఆర్వో సుహాషిణి, డిపిఎంఒ శంకరయ్య, శ్రీను, సుబ్బరాయుడు, సీహెచ్ఓ క్రిష్ణమ్మ, సూపర్‌వైజర్ బిఎ వర ప్రసాద్, ఐసీడీయస్ సూపర్‌వైజర్ ఈశ్వరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు గీతా, నూర్జహాన్, సువార్తమ్మ, మహిళా పోలీసు రజియా సుల్తానా, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

దుప్పట్లు, గృహోపకరణాలు వితరణ

పులివెందుల టౌన్ : విభిన్నప్రతిభావంతులకు దుప్పట్లు, గృహోపకరణాలు వితరణ చేయడం హర్షణీయమని ఆ నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కార్యాలయంలో సోమవారం బలపనూరు కొత్తపల్లి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి సతీమణి జయభారతి మాతృమూర్తి చప్పిడి సుభద్రమ్మ స్మారకార్థం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో, వారి కుటుంబ సభ్యులు వితరణ చేశారు. కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్య, అనిల్, బాలయ్య, వల్లి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్లక్ష్యం

ప్రశ్నార్థకంగా కెసి పరిధిలో పంటల సాగు.. 'వరి'కి విరామం ప్రకటించుకునే పరిస్థితి



రాజోలు ఆనకట్ట

ప్రజాశక్తి- చాపాడు

కెసి కెనాల్ ఆయకట్టు పరిధికి నీటి విడుదల కోసం ప్రతి ఏడాది ఖరీఫ్‌లో ఎదురు చూడాల్సిన పరిస్థితి రైతులకు తప్పడం లేదు. తమకు అను కూలమైన పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. మైదుకూరు నియోజకవర్గంలో పంటల సాగుకు కర్ణాటక, మహారాష్ట్రల్లో పడే వర్షాలపై ఆదారపడే స్థితి నెలకొంది. కుందూ నది గుండా లక్షల క్యూసెక్కుల నీరు సోమశిల ప్రాజెక్ట్‌కు చేరుతున్నా పాలకులు ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. కెసి రైతుల శాశ్వత సమస్యకు సమాధానం చూపలేని పరిస్థితి. రాజోలి ఆనకట్ట పెంపు ప్రాజెక్ట్‌పై నిర్లక్ష్యం కొనసాగుతుండటంతో ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం ముందుకు సాగడం లేదు. దీంతో ప్రస్తుతం కెసి పరిధిలో పచ్చని పైరుతో ఉండాల్సిన సందర్భంలో ఎడారిని తలపించే బీడు భూములు, వర్షాధార పంటలు దర్శనిమిస్తున్నాయి. 31న ప్రజారక్షణభేరి బస్సు యాత్ర సందర్భంగా ప్రత్యేక కథనం..

రాజోలి ఏర్పాటులో నిర్లక్ష్యం..

జిల్లాలోని లక్షలాది మంది రైతుల గుండె సవ్వడి ప్రవాహమే కెసి కెనాల్. ఈ ప్రాంత రైతుల కుటుంబాలకు బతుకు తెరువు. కెసి కెనాల్ రైతుల పాలిట కల్పతరువు. జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తున్న ఒక పెద్ద ప్రాజెక్టు రాజోలి ఆనకట్ట. కెసి కాలువ ద్వారా జిల్లాలోని రాజుపాలెం, దువ్వూరు ,ప్రొద్దుటూరు, చాపాడు, మైదుకూరు, ఖాజీపేట, వల్లూరు, చెన్నూరు, కడప మండలాల్లో 92 వేల ఎకరాలలో సాగు భూమి ఉంది. ప్రస్తుతం వరి, పసుపు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, మినుము ఇతర పంటలను దేశానికి ఎగుమతి చేసే దిశగా కెసి కెనాల్ ప్రాంత రైతులు ఉన్నారు. డిసెంబర్ 2019, 23న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజోలి ఆనకట్టను 2.95 టిఎంసిల సామర్థ్యంతో సుమారుగా రూ. 800 కోట్లకు పైగా నిధులు వెచ్చించి నిర్మించే ప్రాజెక్టు భూమిపూజ చేశారు. ఆ తర్వాత టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని కాలం వెలిబుచ్చుతూ వస్తున్నారు. నాలుగేళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ పురోగతి లేదని రైతులు పేర్కొంటున్నారు. వర్షపు నీరు నిల్వ చేసే సామర్థ్యం లేక పోవడంతో కుందూ వరద నీరు పెన్నా గుండా సోమశిల ప్రాజెక్టులోకి ప్రతి ఏడాది లక్షల క్యూసెక్కుల నీరు తరలివెళ్తుంది. అధికారుల నివేదిక ప్రకారం ప్రతి ఏడాదీ 50 నుంచి 70 టిఎంసిల నీరు సోమశిలకు చేరు తుంది. రాజోలు ఆనకట్ట పెంపుదల చేస్తే ఈ నీటిని నిల్వ ఉంచి కెసి కెనాల్‌కు మళ్లించడం ద్వారా రైతులు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది.

కనపడని వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు..

మైదుకూరు నియోజకవర్గంలో కెసి కెనాల్ పరిధిలో వరి తరువాత అత్యధికంగా కూరగాయలను, కెపి ఉల్లి, పచ్చిమిర్చి, టమోటా ఇతర కూరగాయలను, పసుపు పంటను రైతులు సాగు చేస్తున్నారు. ధరలలో నిలకడ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు సాగు చేసి పండించిన కూరగాయలను నిల్వ చేసుకునే ఏసీ గోడౌన్లు ఇతర పరిశ్రమలు అందుబాటులో ఉంటే ధర వచ్చినప్పుడు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వాలు మారినా రైతు సమస్యలను పట్టించుకునే నాధుడే కరువయ్యారు. రాష్ట్రంలోనే ఎక్కడ సాగు చేయని విదేశీకి ఎగుమతి చేసే కెపి ఉల్లి మైదుకూరు ప్రాంతంలో సాగు అవుతుంది. కెపి ఉల్లి శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కొన్ని సంవత్సరాలుగా రైతులు కోరుతున్నా ఆ దిశగా ఏర్పాట్లు జరగడం లేదు. అలాగే శాశ్వత మార్కెట్, ఆటో స్టాండ్‌కు స్థలం కేటాయింపు జరగాలి. ప్రభుత్వ ఆధ్వర్యంలో పాలసేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దుర్భరంగా పేదల కాలనీలు..

మైదుకూరులోని పలు కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షం పేరు వింటేనే పేద ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వర్షం వచ్చిందంటే పిల్లాపాపలతో ఇంటిల్లపాది ఇళ్ల చుట్టూ చేరిన నీటిలో రాత్రిళ్లు జాగారం చేయాల్సి వస్తుంది. ఈ పరిస్థితి ఏదైనా మారుమూల ప్రాంతానిది అనుకుంటే పొరపాటే. మున్సిపాలిటీ పరిధిలోని బద్వేల్ రోడ్డు వనిపెంట రోడ్డులోని వెంకటసుబ్బయ్య కాలనీ, వీణ విజయరామరాజు కాలనీ, సిపిఎం కాలనీ ,చెంచు కాలనీ, ఇందిరమ్మ కాలనీలతో పాటు సర్వాయపల్లె రోడ్డు లోని పలు వీధులు, నంద్యాల రోడ్డులో సీతారామాంజనేయపురం కాలనీలది దుర్భర పరిస్థితి. వర్షాకాలంలో కాలనీవాసులు పడుతున్న కష్టాలు వర్ణించలేనిది. పేదలు సొంత ఇంటిని నిర్మించుకో లేని పరిస్థితులలో మున్సిపాలిటీ పరిధిలో పేదలు పలు కాలనీలలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. కాలనీల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్ ,సిమెంటు రోడ్లు వేసే వారు లేరు. వర్షం నీరు నిలువకుండా అనుసంధాన కాలువలు వంకలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో జలమయంగా మారుతున్నాయి. కాలనీ వాసుల కష్టాలపై పలుమార్లు స్థానిక సిపిఎం నాయకులు అధికారుల దృష్టికి తీసుకుపోతున్నప్పటికీ ఏ మాత్రం ఉపయోగం లేదని వారు వాపోతున్నారు.

గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవేలోనూ రైతులకు అన్యాయం..

మైదుకూరు నియోజకవర్గంలో చాపాడు, మైదుకూరు, బ్రహ్మంగారి మఠం మండలాల మీదుగా బెంగళూరు - విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే ఏర్పాటు చేయడం హర్షనీయం. ఈ హైవే రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు మాత్రం తీవ్ర అన్యాయం జరుగుతోంది. మార్కెట్‌లో కోట్ల విలువ చేసే భూములను ప్రభుత్వం కేవలం రూ. 10 నుంచి 20 లక్షలు మాత్రమే చెల్లిస్తూ బలవంతంగా సేకరిస్తోంది. అలాగే పేదలకు గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములకు నష్టపరిహారం చెల్లించడం లేదు. తాత్కాలిక పట్టాల పేరు సాకుగా చూపుతూ నష్టపరిహారాన్ని అందించడం లేదు. దీంతో పేద దళిత వర్గాలు తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములు హైవేలో నిర్మాణంలో పోతుండడంతో ఉపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే పరిస్థితి కనిపించడం లేదు.



మురికితో అధ్వానంగా ఉన్న మైదుకూరులోని ఓ వీధి

రైతు సమస్యల పరిష్కారంలో విఫలం..

మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రైతుల అభివృద్ధికి ప్రభుత్వం ఏమాత్రం పాటుపడడం లేదు. రాజోలి ఆనకట్ట నిర్మాణం వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కెపి ఉల్లి శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి. మైదుకూరు మున్సిపాలిటీలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



- శివకుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

ప్రజా రక్షణభేరి బహిరంగ సభకు తరలిరండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభి వృద్ధి కోసం బుధవారం కడప పాత బస్టాండ్ వద్ద జరిగే ప్రజారక్షణభేరి బహి రంగ సభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎ. వినయ్‌కుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ పిలుపు నిచ్చారు. పట్ట ణంలోని మస్టర్డ్ పా యింట్ వద్ద ప్రజా రక్షణభేరి కర పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేకహోదా, పోల వరం ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ వంటి విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేసిన బిజెపి.. అంతటితో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ వంటి విశాఖ ఉక్కును అమ్మడానికి తయారైందని విమ ర్శించారు. అన్నదమ్ముల్లా సమైక్యంగా మెలగవలసిన ప్రజల మధ్య బిజెపి విద్వేషాలు రాజేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు గోపాల దాస్, ఏసుదాసు, ప్రసాద్‌రెడ్డి, దివాకర్, రవి, రాజు, నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు

ప్రజారక్షణ భేరిని విజయవంతం చేయాలి : ఐద్వా

ప్రొద్దుటూరు : సమస్యల పరిష్కారం కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) నిర్వహిస్తున్న ప్రజారక్షణభేరి బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదరి ముంతాజ్ బేగం పిలుపునిచ్చారు. స్థానిక ఐద్వా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మంగళవారం సాయంత్రం 6 గంటలకు మైదుకూరులో, నవంబర్1న బద్వేలులో కడపలో బహిరంగ సభలు ఉంటాయన్నారు. మహిళలపై అకృత్యాలు అధికమయ్యాయన్నారు. వాటిని అరికట్టడంలో అధికారంలోకొచ్చి 9ఏళ్ల గడుస్తున్నా బిజెపి ప్రభుత్వం విఫలమైందన్నారు. విభజన హామీలను గాలికొదిలేశారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపితో సహా టిడిపి, జనసేన పార్టీలు కూడా బిజెపి నిర్ణయాలకు తలూపుతూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నాయన్నారు. దీనిపై సిపిఎం చేస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా ప్రొద్దటూరు అధ్యక్ష, కార్యదర్శులు సర్వేస్వరి, వెంకటసుబ్బమ్మ, లక్ష్మిదేవి, భానుమతి పాల్గొన్నారు.

నేడు మైదుకూరు ప్రజా రక్షణభేరి జాతా

చాపాడు : అసమానతలు లేని అభివృద్ధి జరగాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు మైదుకూరులో జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్ కోరారు. సోమవారం స్థానిక మైదుకూరు పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి ఆటంకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30 నుంచి మూడు బస్సు జాతాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. కర్నూలు జిల్లా నుండి ప్రారంభమైన బస్సు జాత మంగళవారం సాయంత్రం మైదుకూరు చేరుకుంటుందన్నారు. బద్వేల్ రోడ్డులోని శ్రీవినాయక క్లాత్ మార్కెట్ దగ్గర బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ హాజరవుతారని తెలిపారు. ప్రజలందరూ బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన చేశారు. సమావేశంలో సిపిఎం నాయకులు గురయ్య, రవి, పోలయ్య, బాలరాజు, రాయప్ప పాల్గొన్నారు.

3న విద్యార్థులకు సర్వేపై పరీక్ష

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని 22 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారులు శివప్రసాద్, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై అవగాహన సదస్సును నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల నుండి ఎంపిక చేయబడిన విద్యార్థులకు నవంబర్ మూడవ తేదీన సర్వేకు సంబంధించి పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వారి సామర్థ్యాలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. సర్వేను భారతదేశం అంతటా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

పోటీ పరీక్షలకు విశేష స్పందన

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా పోటీ పరీక్షకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. మండలస్థాయిలో 8,9,10 విద్యార్థులకు డాక్టర్ విశ్వనాథరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహించారు. నిర్వాహకులు మల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాఠశాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 142 మంది విద్యార్థులకు ప్రతిభా పరీక్ష పాఠశాల సిబ్బంది అధ్వర్యంలో నిర్వహించారు. మొదటి మూడు ర్యాంకులు స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. వీరికి వరుసగా రూ.5000, రూ.3000, రూ.2000 నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రం, మెమెంటో ఇవ్వనున్నట్లు పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సివి ప్రసాద్ తెలిపారు.

దేశ సమగ్రత, అభివృద్ధికి ఐక్యత పునాది వంటిది

ప్రజాశక్తి - వేంపల్లె

దేశ సమగ్రత, అభివృద్ధికి ఐక్యత అనేది పునాది వంటిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. జాతీయ సమైక్యత వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఐక్యతకు పరుగు అనే కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్, జిల్లా పరిషత్ పాఠశాల ఆధ్వర్యంలో పరుగును ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, ఎస్ఐ ప్రారభించారు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాల నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు విద్యార్థులతో కలిసి అధికారులు, ఉపాధ్యాయులు పరుగు పెట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ఎన్‌సిసి అధికారి బుక్కే గోపాల్ నాయక్, పీడీ రాజశేఖర్, పీడీ తేజేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి : ఒఎస్‌డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ ఎస్ హఫీజ్, కమిషనర్ వివి నరసింహారెడ్డితో పనులపై సమీక్షించారు. ప్రతి కాంట్రాక్టర్ వారు చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సంబంధిత పనులను పూర్తి చేసేందుకు ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్లు, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

వస్తువు కొనేముందు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వినియోగదారులు తమ అవసరాల నిమిత్తం వస్తువులు కొనేముందు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పి.జయదేవ్ సూచించారు. తమ కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ.. వస్తువును కొనేముందు గరిష్ట ధర (ఎంఆర్‌పి), కాలపరిమితి, తయారీదారి చిరునామా, తూకం వంటి వివరాలు చూడాలన్నారు. తేడాను గమనిస్తే తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. 50కిలోలుండాల్సిన క్రిమి సంహారకాలు 48 కిలోలతో రైతులను మోసం చేస్తున్నందువల్ల, వాటిని ఎంఆర్‌పి, తయారైన తేది, కస్టమర్ కేర్, చిరునామా లేకపోవడం వల్ల పటాకులను, పొగతాగడం హానికరం అన్న హెచ్చరిక లేనందున సిగరెట్లను సీజ్ చేశామని జయదేవ్ తెలిపారు.



సీజ్ చేసిన వస్తువులు

దాడిలో ప్రవీణ్ ప్రమేయం లేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

బెనర్జీపై దాడిలో టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రమేయం ఒక్క శాతం కూడా లేదని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి కార్య కర్త బెనర్జీపై దాడి చేసిన భరత్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా జరిగిందని, ఇందులో ఎలాంటి కుట్ర లేదన్నారు. బెనర్జీకి రక్త గాయాలు కాగా ఆసుపత్రికి చేర్చారన్నారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారన్నారు. భరత్ కూడా ముందుగా కొడవలి తీసుకొని రాలేదన్నారు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి కొడవలితో దాడి చేశాడన్నారు. దాడి జరిగిన తర్వాత కూడా భరత్, బెనర్జీని అక్కడ నుండి వెళ్ళమని చెప్పాడని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే ప్రవీణ్‌కుమార్ రెడ్డిని కేసులో ఇరికించారన్నారు. వైసిపి నాయకులు ప్రవీణ్ ప్రమేయం ఉందని మాట్లాడడం అసమంజసమన్నారు. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం అనుకోకుండా జరిగిన సంఘటనలా తెలుస్తోం దన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

పోలీసుల తీరు అభ్యంతరకరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గత శనివారం ప్రొద్దుటూరులో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుల ఆచూకీ తెలుపమని పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరమని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తండ్రి ప్రతాపరెడ్డి, ప్రవీణ్ సతీమణి మౌనిక అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ హత్యాయత్నం పట్టపగలు జరిగిందని, ఆ సమయంలో ఒక ఎస్ఐతోపాటు కొంతమంది పోలీసులు కూడ అక్కడే ఉన్నారని తెలిపారు. వారిని అడగకుండా తమను నిందితుల కోసమని వేధించడం తగదన్నారు. పోలీసుల ఎదుటే హత్యాయత్నం జరుగుతున్నప్పటికీ నిందితులను పట్టుకోకుండా, అక్కడ లేని మమ్ములను నిందితుల కోసమని వేధించడం అంగీకారం కాదన్నారు. పోలీసుల షాడో పార్టీ పరిధిలో ఉన్న ప్రవీణ్ కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేయడం వారి ఏకపక్షంగా వ్యవ హరిస్తున్నారనేందుకు నిదర్శనమన్నారు. వీటిపై తాము న్యాయపోరాటం చేస్తా మన్నారు. మౌనిక మాట్లాడుతూ ఇద్దరి మధ్య గొడవ జరిగి చేసిన హత్యా యత్నం సమయంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కమలాపురం మండలం కోగటంలో ఉన్నారని తెలిపారు. తన మామ, తన భర్తకు ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యత అన్నారు. టిడిపి నాయకుడు జబీవుల్లా మాట్లాడుతూ ఈ హత్యాయత్నం కేసులో ప్రవీణ్‌రెడ్డిని కుట్రదారునిగా పెట్టడం అన్యాయ మన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి చెప్పేదొకటి చేసేది మరొకటి అన్నారు.

నా బిడ్డకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

'కష్టం చేసుకొని బతికేటోళ్లం.. నాకొడుకు బెనర్జీ చావుబతుకుల మధ్య ఉన్నాడు. నా బిడ్డకు న్యాయం చేయండి' అని శనివారం నాటి హత్యాయత్నం కేసులో గాయపడిన బెనర్జీ తల్లి రామేశ్వరం బుజ్జమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన కొడుకు మీద ఎందుకు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారో టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ జవాబు చెప్పాలన్నారు. బస్సుయాత్రకు ఆటంకం కలిగించాలని శనివారం దాడికి పాల్పడ్డారన్నారు. భరత్, రాము అను వ్యక్తులు తన బిడ్డపై ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు.

అన్న క్యాంటీన్‌కు వంద రోజులు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రతిరోజూ దాదాపు 4500 మందికి భోజనం పెడుతున్నందుకు చాలా సంతోషంగా ఉందని, వారి అభిమానంతో అన్న క్యాంటీన్ 100 రోజులు పూర్తి చేసుకుందని టిడిపి రాష్ట్ర నాయకులు సిఎం సురేష్‌నాయుడు తెలిపారు. అన్న క్యాంటీన్ ప్రారంభించి వంద రోజులు అయిన సందర్భంగా సోమవారం ఆయన మూడో మొబైల్ క్యాంటీన్‌ను ప్రారంభించారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్ సిఎం సురేష్ నాయుడు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి విద్యా సంస్థల అధినేత బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, టిడిపి నాయకులు ముక్తియార్, సుధాకర్‌రెడ్డి, బొర్రా రామాంజనేయులు, మాజీ ఎంపీపీ మెట్టుపల్లి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐదుగురు మట్కారాయుళ్లు అరెస్టు

రూ.8,200 నగదు స్వాధీనం

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని పంక్చర్ బంకు వద్ద సోమవారం సెల్‌ఫోన్లో ఆన్‌లైన్ ద్వారా మట్కా ఆడుతున్న ఐదుగురు మట్కారాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. వారి వద్ద నుండి రూ.8,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.